నేడు కరీంనగర్‌లో
కేసీఆర్ రోడ్ షో

- రాంనగర్ నుంచి తెలంగాణచౌక్ వరకు ర్యాలీ
- అక్కడే ప్రజలనుద్దేశించి అధినేత ప్రసంగం
- గ్రాండ్ సక్సెస్ చేసేందుకు పార్టీ శ్రేణుల ఏర్పాట్లు
- పరిశీలించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, మే 8 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : పోరుబాటలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు కరీంనగర్ వస్తున్నారు. సాయంత్రం నిర్వహించే రోడ్ షోలో పాల్గొననున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రోడ్‌షోలు గ్రాండ్ సక్సెస్ అవుతుండగా.. ఉమ్మడి జిల్లాలో గోదావరిఖని, జగిత్యాలలో రోడ్‌షోలు, వీణవంకలో ఆత్మీయ సమ్మేళనానికి ప్రజలు అశేషంగా తరలివచ్చారు. అభిమాన నేత కేసీఆర్‌కు నీరాజనం పలికారు. ఈ నేపథ్యంలో గురువారం కరీంనగర్‌లో రోడ్‌షో నిర్వహించేందుకు పార్టీ నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. గులాబీ దళపతి హైదరాబాద్ నుంచి రాజీవ్‌రహదారి మీదుగా వస్తారని, నగరంలోని బైపాస్ రోడ్డు ద్వారా ముందుగా రాంనగర్ చౌరస్తాకు చేరుకుంటారని వెల్లడించారు. రాంనగర్ చౌరస్తా వద్ద ఘన స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

అక్కడి నుంచి ర్యాలీగా మొదలై.. మంకమ్మతోట, టుటౌన్ పోలీస్‌స్టేన్, ముకరంపుర మీదుగా తెలంగాణ చౌక్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నిర్వహించే రోడ్ షోలో కేసీఆర్ పాల్గొంటారు. అనంతరం కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని తన ఇంటిలో బస చేసి, శుక్రవారం సాయంత్రం సిరిసిల్లలో నిర్వహించే రోడ్‌షోకు వెళ్తారు. ఆ తర్వాత అక్కడి నుంచి సిద్దిపేటలో జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు. కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో జరిగే సమావేశంలో కేసీఆర్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. బీఆర్ఎస్ పాలనకు, నేటి కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడాను స్పష్టంగా వివరించనున్నారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగిన అభివృద్ధి గురించి కండ్లముందుంచనున్నారు. ముఖ్యంగా ఎంపీగా, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగానే కాకుండా.. ముందు నుంచీ ఉద్యమంలో అడుగులో అడుగై.. తనతో నడిచిన, నడుస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, కరీంనగర్ నుంచి గెలువాల్సిన ఆవశ్యకతను వివరించనున్నారు. నేటి కేసీఆర్ రోడ్‌షోకు స్వచ్ఛందంగా జనం తరలి వచ్చే అవకాశముండగా.. ఇదే సమయంలో రాంనగర్ నుంచి తెలంగాణచౌక్ వరకు దారిపొడవునా స్వాగతం పలికేందుకు ప్రజలు ఎక్కడికక్కడ సిద్ధమయ్యారు. ఇటు రోడ్‌షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌తోపాటు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం రోడ్‌షో రూట్ మ్యాప్‌ను ఎమ్మెల్యే గంగుల పరిశీలించారు. తెలంగాణ చౌక్‌లో ఏర్పాట్లను పరిశీలించి లైటింగ్‌పై సూచనలు చేశారు. ఆయనవెంట ఎమ్మెల్సీ భానుప్రసాద్, నగర మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో కేసీఆర్ రోడ్‌షో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, చిత్రంలో మేయర్ సునీల్‌రావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్

ఐదేళ్లు.. 553 ప్రశ్నలు

- 16వ లోక్‌సభలో బోయినపల్లి వినోద్‌కుమార్ ట్రాక్ రికార్డు
- 2014 నుంచి 19 మధ్య ఎక్కువ ప్రశ్నలు అడిగిన ఎంపీగా ముద్ర
- నిబంధనలు సహకరించకపోయినా కేంద్రాన్ని ఒప్పించి కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా
- జాతీయ రహదారుల జంక్షన్‌కోసం అలుపెరుగని కృషి
- నగరంలోనే ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు
- పోయిన ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజల పక్షానే పోరాటం

ఆయనకు పదవి ఉన్నా, లేకపోయినా నిరంతరం ప్రజల కోసం పనిచేసే నాయకుడు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా.. అభివృద్ధే శ్వాసగా ముందుకు సాగే కృషీవలుడు. కరీంనగర్ నుంచి 16వ లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకయ్యారు. ఐదేళ్ల కాలంలో 553 ప్రశ్నలు సంధించి దేశంలోనే ఎక్కువ ప్రశ్నలు అడిగిన ఎంపీగా నిలిచి ఈ ప్రాంతానికే వన్నెతెచ్చారు. నాడు ఉద్యమ నేత కేసీఆర్‌కు అడులో అడుగై, ఆ తర్వాత పార్లమెంట్‌లో ప్రశ్నించే నేతగా పేరుగాంచారు. క్రమశిక్షణకు మారుపేరుగా వివాద రహితుడిగా, విజ్ఞానవంతుడిగా అందరి మనస్సుల్లో ముద్రవేసుకున్న ఆయన ఎవరోకాదు.. ప్రస్తుత బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్! అప్పుడే కాదు, ఇప్పుడూ ఒక లక్ష్యంతో ఆయన బరిలో దిగారు. అందరికంటే ముందుగానే జనంలోకి వెళ్లి.. ఎంపీగా తనను గెలిపిస్తే కరీంనగర్‌కు ఏమి సాధిస్తారో..? స్పష్టం చేయడమే కాదు, కరపత్రంలోనూ ముద్రించి అందరి మన్ననలు పొందారు.

కరీంనగర్, మే 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఆది నుంచీ ప్రజల పక్షానే నిలిచారు. కరీంనగర్ నుంచి 16వ లోక్‌సభ సభ్యుడిగా గెలిచి, పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకయ్యారు. తెలంగాణపై పూర్తి పట్టున్న ఆయన, రాష్ట్రానికి జరుగుతున్న ఎన్నో అన్యాయాలపై పార్లమెంట్ సాక్షిగా కేంద్రాన్ని నిలదీశారు. అక్కడితో ఆగకుండా ఎంపీగా తన పదవీ కాలంలో 106 చర్చల్లో పాల్గొన్నారు. అంతేకాదు, చర్చల్లో చురుగ్గా పాల్గొన్న మొదటి వ్యక్తిగా నిలిచారు. ఒకటి రెండు కాదు 2014 నుంచి 2019 వరకు ఐదేళ్ల కాలంలో వివిధ అంశాలపై 553 ప్రశ్నలు సంధించి ఎక్కువ ప్రశ్నలు అడిగిన ఎంపీగా మొదటి స్థానంలో నిలిచారు. సిరిసిల్లలో అప్పారెల్ పార్క్‌కు కోసం, శాసనభలో సీట్ల పెంపు, తెలంగాణలో ఏఐఐఎంఎస్ ఏర్పాటు వంటి అనేక అంశాలపై కేంద్రాన్ని నిలదీశారు. పదవిలో ఉన్నా లేకపోయినా, ఆయన కరీంనగర్ అభివృద్ధే శ్వాసగా పనిచేశారు. కేంద్రం దేశంలోని అనేక ప్రాంతాలకు మెడికల్ కళాశాలలు మంజూరు చేసిన సమయంలో కరీంనగర్‌కు కూడా ఇవ్వాలంటూ కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. కేంద్ర చట్టం ప్రకారం జిల్లాకో నవోదయ పాఠశాల ఇవ్వాల్సి ఉందంటూ దానిపై పోరాటం చేస్తూనే ఉన్నారు. తెలంగాణలో ప్రజల సౌకర్యార్థం సీఎం కేసీఆర్ 2016 అక్టోబర్ 11న చిన్న జిల్లాలను ఏర్పాటు చేయగా, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు నవోదయ పాఠశాలలు ఇవ్వాలంటూ ఆయన అనేకసార్లు కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. కరీంనగర్‌కు రావాల్సిన ట్రిపుల్ ఐటీ కర్నాటక రాష్ట్రం తన్నుకొని పోతే కేంద్రాన్ని ప్రశ్నిస్తూ, కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు.

నిబంధనలు అడ్డువచ్చినా స్మార్ట్‌సిటీ సాధించి..

నిజానికి పది లక్షల జనాభా ఉంటేనే స్మార్ట్ సిటీ ఇస్తామని కేంద్రం నిబంధనలు పెట్టింది. అందులో భాగంగానే ముందుగా హైదరాబాద్, వరంగల్ నగరాలను ఎంపిక చేసింది. దీనిపై దూరదృష్టితో ఆలోచన చేసిన వినోద్‌కుమార్, నిబంధనలు సహకరించకపోయినా కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ సాధించారు. దీని కోసం ఆనాడు హైదరాబాద్‌కు బదులు కరీంనగర్‌కు ఆ జాబితాలో చోటు కల్పించేలా కేసీఆర్‌ను ఒప్పించి, కేంద్రానికి లేఖ రాయించారు. అలాగే ఆనాటి రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్‌తో కలిసి 2016 ఫిబ్రవరి, మార్చిలో ఢిల్లీకి వెళ్లిన సమయంలో స్మార్ట్‌సిటీ జాబితాలో కరీంనగర్‌కు చోటు కల్పించాలని కేంద్రమంత్రి వెంకయ్య నాయుడికి లిఖితపూర్వకంగా లేఖ ఇచ్చారు. వాటి ఆధారంగా స్మార్ట్ సిటీ జాబితాలో, 2016 జూన్‌లో కరీంనగర్‌ను చేర్చేలా వినోద్‌కుమార్ పట్టుబట్టి సాధించారు. ప్రస్తుతం నగరంలో మెరుస్తున్న రోడ్లు, ఫుట్‌పాత్‌లు, అందమైన లైట్లు, పార్కుల నిర్మాణాలకు కారణం వినోద్‌కుమార్ కృషి ఫలితమే. ఎంపీగా ఉన్నప్పుడు ఉత్తర తెలంగాణలోనే కరీంనగర్‌ను జాతీయ రహదారుల జంక్షన్ చేయాలన్న లక్ష్యంతో పనిచేశారు. ఆ మేరకు అనేక జాతీయ రహదారులకు కేంద్రం అంగీకారం వచ్చేలా కృషి చేశారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు జాతీయ రహదారుల పనుల పర్యవేక్షణ కోసం 2016 జూన్ 24న ఎస్ఈ కార్యాలయాన్ని పట్టుబట్టి ఏర్పాటు చేయించారు. ఇదేకాదు, కొత్తపల్లి– మనోహరాబాద్ రైల్వేలైన్ పట్టుబట్టి సాధించారు. ఈ విషయంలో కేంద్ర అనేక కొర్రీలు పెట్టినా.. అప్పటి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సహకారంతో అధిగమిస్తూ, చివరకు రైల్వే లైన్‌ను ట్రాక్ ఎక్కించారు. తాను ఎంపీగా లేకపోయినా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా భూసేకరణ విషయంలో నాలుగైదు సార్లు అధికారులతో మీటింగ్‌లు పెట్టి, లైన్ త్వరిత గతిన పూర్తికి చర్యలు తీసుకున్నారు.

గెలిపిస్తే ప్రజాగొంతుకలా..

తనకు ఈ ఎంపీ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తే పార్లమెంట్‌లో ప్రజాగొంతుకగా మారుతానని వినోద్ కుమార్ చెబుతున్నారు. కరీంనగర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చి చూపిస్తానని స్పష్టం చేస్తున్నారు. ఐఐటీ, ఐఎస్ఈఆర్, ఐఐఎం వంటి కేంద్ర విద్యాసంస్థలను కరీంనగర్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తామంటున్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాలకు నవోదయ పాఠశాలలు, ముఖ్యంగా యూత్ ఎంప్లాయిమెంట్ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, జిన్నింగ్ మిల్లులు, ఐటీ విస్తరణ, ఉమ్మడి జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాల అభివృద్ధి, ఇంకా నియోజకవర్గ ప్రగతి కోసం అనేక పనులు సాధిస్తామని వినోద్ కుమార్ స్పష్టం చేస్తున్నారు.

జమ్మికుంటలో రోడ్‌షోకు అశేషంగా తరలివచ్చిన ప్రజలు

ప్రధాని వేములవాడకు వచ్చి ఒక్క హామీ ఇవ్వరా?

పేదల దేవుడు రాజన్నపై మోడీ చిన్నచూపెందుకు?

జమ్మికుంట/ మానకొండూర్ రూరల్, మే8: 'పేదల దేవుడు రాజన్న అంటే ప్రధాని మోడీకి అంత చిన్నచూపెందుకు? మరి దక్షిణ కాశీగా పేరుగాంచిన పుణ్యక్షేత్రానికి వచ్చి రాజన్న గుడి అభివృద్ధిపై ఒక్క మాట మాట్లాడలేదు. కనీసం ఒక్క హామీ ఇవ్వలేదు. కాశీకి వేల కోట్లిచ్చి అభివృద్ధి చేస్తున్న ఆయన, వేములవాడకు ఒక్క రూపాయి ఇవ్వడా..?' అని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ మండిపడ్డారు. ఇంతటి పుణ్యక్షేత్రంలో సభ ఏర్పాటు చేస్తే పక్కనే ఉన్న బండి సంజయ్ దీనిపై ప్రధానిని ఎందుకు అడుగలేకపోయారని ప్రశ్నించారు. వాళ్లకు దేవుళ్ల పేరిట రాజకీయం చేసుడు తప్ప, అభివృద్ధి మీద ధ్యాస లేదని విమర్శించారు. అలాంటి అభ్యర్థికి మనం ఓటెందుకు వేయాలని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రజలంతా ఆలోచన చేయాలని కోరారు. అభివృద్ధి కోసం పాటుపడే గులాబీ పార్టీ అభ్యర్థులకే ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఇక రాష్ట్రంలో మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం మానకొండూర్, శంకరపట్నం, జమ్మికుంటలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, సీనియర్ నాయకుడు గడ్డం నాగరాజుతో కలిసి రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల వినోద్‌కుమార్ మాట్లాడారు. ప్రధాని మోడీ వేములవాడకు వచ్చినా రాజన్న గుడికి నిధులు, ఇతర సమస్యల గురించి ఒక్క మాట అడుగలేని బండి.. ఎంపీగా ఉండడం ఎందుకు అని ప్రశ్నించారు. కొత్త జిల్లాల్లో నవోదయ విద్యాలయాల ఏర్పాటు, ఇరిగేషన్ ప్రాజెక్టులకు జాతీయ హోదా గురించి ఎందుకు అడుగలేదో..? వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం రాదనే అసహనంతోనే మోడీ నిరాశకు గురవుతున్నారని, ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆనాడు తాను ఎంపీగా ఉన్నప్పుడు కేంద్రం ప్రభుత్వ ప్రసాద్ పథకంలో వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం ఆలయాలను చేర్చి అభివృద్ధి చేయాలని కోరినా పట్టించుకోలేదని గుర్తు చేశారు. కానీ, బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి చేసుకున్నామని, 32 ఎకరాల వేములవాడ గుడి చెరువులో మట్టి నింపి అభివృద్ధి చేసుకున్నట్లు వివరించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు తానొక్కటే విజ్ఞప్తి చేస్తున్నానని, అభివృద్ధి చేసే బీఆర్ఎస్ కావాలో..? దేవుడిపేరుతో రాజకీయాలు చేసే బండి కావాలో..? ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఐదేళ్లలో బండి ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. పైసా కూడా తీసుకురాని అభ్యర్థి మనకెందుకని ప్రశ్నించారు. కాగా, జమ్మికుంట రోడ్‌షోలో సెల్‌ఫోన్‌లోని ఫ్లాష్‌లైట్లతో వినోదన్నకు మద్దతు తెలుపాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కోరగా, హాజరైన ప్రజలందరూ ఫ్లాష్‌లైట్లతో మద్దతు పలికారు. అనంతరం 'దేశ్ లేంగే ..' సాంగ్‌కు ఎమ్మెల్యేతో పాటూ అందరూ నృత్యం చేశారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్సీ నారదాసు, జడ్పీ అధ్యక్షురాలు విజయ, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ అర్బన్ శాఖ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మానకొండూర్ రోడ్‌షోలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మానకొండూర్ సొసైటీ చైర్మన్ నల్ల గోవింద రెడ్డి, ఊటూర్ సొసైటీ చైర్మన్ ముద్దసాని ప్రదీప్ రెడ్డి, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు బొంగోని రేణుక తదితరులు ఉన్నారు.

అభివృద్ధా..? విధ్వంసమా? ప్రజలే ఆలోచించాలి

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మార్పు తెస్తమంటే ప్రజలు నమ్మి మోసపోయిన్రు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నది. ఇది ప్రజలందరికీ అర్థమైంది. ఈ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నరు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల కొమ్ముకాస్తున్నది. కాంగ్రెస్, బీజేపీది విధ్వంసం. బీఆర్ఎస్‌ది ప్రగతి పథం. అభివృద్ధి కావాలా..? విధ్వంసం కావాలా..? ప్రజలే ఆలోచించాలే. ప్రజల బాగుకోరే గులాబీకే పట్టంకట్టాలి. నేను రెండుసార్లు ఎంపీగా పనిచేసిన. మొదటి సారిగా తెలంగాణ కోసం కొట్లాడి తెచ్చినం. రెండో సారి రూ.వెయ్యి కోట్లతో కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దిన. ఈ సారి నన్ను గెలిపిస్తే పార్లమెంట్ నియోజకవర్గాన్ని గొప్పగా తీర్చిదిద్దుతా. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ఏర్పాటు చేయిస్త. రాబోయే రోజుల్లో ఎంపీగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో కలిసి సింగాపూర్ వెళ్లి అధ్యయనం చేస్తం.

- బోయినపల్లి వినోద్ కుమార్

మానకొండూర్ రోడ్ షోలో మాట్లాడుతున్న వినోద్ కుమార్

- బండి సంజయ్ ఎందుకు అడుగలేకపోయారు
- దేవుళ్ల పేరిట రాజకీయాలు చేయడం తప్ప అభివృద్ధిపై ధ్యాసలేదు
- కాంగ్రెస్, బీజేపీని నమ్మితే విధ్వంసమే
- ప్రజల కోసం పనిచేసే గులాబీ అభ్యర్థులను గెలిపించుకోవాలి
- రోడ్‌షోల్లో కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బీ వినోద్ కుమార్

యాభై వేల మెజార్టీ ఇద్దాం

ఆరు గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుదాం. సంక్షేమం.. అభివృద్ధి ఉద్యమంలా పని చేసే బీఆర్ఎస్‌నే గెలిపించుకుందాం. భాష రాని ఎంపీ మనకెందుకు?, పార్లమెంట్‌లో గళమెత్తే వినోదన్నను 50వేల మెజార్టీతో గెలిపించుకొని కేసీఆర్‌కు బహుమతిగా అందిద్దాం. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి చేతిలో మరోసారి మోసపోవద్దు.

- పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే

వినోద్ గెలుపు మన బాధ్యత

తెలంగాణ పొలిటికల్ ఐకాన్ వినోద్‌కుమార్. ఆయనను మరోసారి ఎంపీగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక అయిన వినోద్‌కుమార్‌తోనే ఈ ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుంది. కాంగ్రెస్, బీజేపీ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదు. రేవంత్‌రెడ్డి మెడలు వంచాలంటే బీఆర్ఎస్‌నే గెలిపించాలి.

- ఎల్ రమణ, ఎమ్మెల్సీ

కరీంనగర్ రూరల్: చామనపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని నేర్పుతున్న రైతు

రైతన్నకు తీరని దుఃఖం

- ఆరుగాలం కష్టం.. వర్షార్పణం
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నీళ్లపాలు
- వారం, పది రోజుల కిందే కేంద్రాలకు తెచ్చినా సేకరణలో తాత్సారం
- అకాల వానతో కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- కన్నీరు పెడుతున్న అన్నదాతలు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

చొప్పదండి/ కరీంనగర్ రూరల్/గన్నేరువరం, మే 8: రైతన్న గుండె చెరువైంది. కాంగ్రెస్ సర్కారు తీరుతో తీరని దుఃఖమే మిగులుతున్నది. మొన్న యాసంగిలో పంటలకు నీరందించకపోవడంతో వందలాది ఎకరాలు ఎండిపోగా, తాజాగా కొనుగోళ్లలో చూపిన నిర్లక్ష్యంతో ఆరుగాలం కష్టం నీళ్లపాలైంది. పది, ఇరువై రోజు కింద నుంచే కొనుగోలు కేంద్రాలకు వడ్లు తెచ్చినా.. కొనుగోళ్లలో జాప్యం చేయడం రైతులను నిండా ముంచింది. రెండ్రోజుల కింద కురిసిన అకాల వానతో సెంటర్లలో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది. పలుచోట్ల వరదకు కుప్పలకు కుప్పలే కొట్టుకుపోగా, రెక్కల కష్టం కండ్ల ముందే నీళ్లపాలు కావడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. వాన నుంచి కాపాడుకునేందుకు మొన్న అష్టకష్టాలు పడ్డారు. నిన్న ఎక్కడ చూసినా తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తూ.. నేర్పుతూ.. సంచుల్లో నింపుతూ కనిపించారు. ఎవరిని కదిలించినా కన్నీటిపర్యంతమవుతున్నారు. ఆరుగాలం శ్రమ నీటిపాలైందని గొడగొడ ఏడుస్తూ చెబుతున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఇవాళ తాము నష్టపోవాల్సి వచ్చిందని మండిపడుతున్నారు. వెనువెంటనే కొంటే ఈ దుస్థితి వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను సర్కారే ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

సర్కారు నిర్లక్ష్యంతోనే వడ్లు నీళ్లపాలు

నేను పది రోజుల కిందే చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌కు 20 క్వింటాళ్ల వడ్లు తెచ్చిన. తొందర్నే కొంటరని సంబురపడ్డ. కానీ ఒక్క రోజు పోయింది. రెండ్రోజులు దాటినయి. అయినా కొన లేదు. ఏవేవో కారణాలు చెప్పిన్రు. ఇంకేం చేస్తం? పొద్దుగాల ఆరబోసుడు, రాత్రి కుప్పలు చేసేతందుకే మా పని అయిపోయింది. తీరా పది రోజుల తర్వాత సంచులు నింపితే మంగళవారం కురిసిన అకాల వానకు ధాన్యం తడిసిపోయింది. అధికారులు వచ్చి ఆ సంచులను ఆరబెట్టాలని అంటున్నరు. ట్రైంకు బార్దాన్లు, కాంట ఇవ్వక జాప్యం చేసుడుతోనే మేం నష్టపోయినం. గత పదేండ్లల ఇలా ఎప్పుడూ జరుగలే. వెంటవెంటనే ధాన్యం కొన్నరు. పైసలు ఇచ్చిన్రు. ఇప్పుడున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే మాకీ కష్టం వచ్చింది. తడిసిన ధాన్యాన్ని కొనాలి.

- కచ్చు సతీశ్, రైతు (చొప్పదండి)

ఓట్ల కోసం ఒట్లా..?

ప్రజలను నమ్మించేందుకు రేవంత్ కొత్త నాటకం

- కాంగ్రెస్‌ను మరోసారి నమ్మితే మోసమే
- కేసీఆర్ పాలనలోనే పేదలకు న్యాయం
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- జూలపల్లి, సుల్తానాబాద్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు

సుల్తానాబాద్ : నినదిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, చిత్రంలో దాసరి మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్/జూలపల్లి మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త నాటకానికి తెరతీశాడని, ప్రజలను నమ్మించేందుకు దేవుళ్లపై ఒట్లు పెడుతున్నాడని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ నిప్పులు చెరిగారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో ప్రజలను నిలువున ముంచిందని ధ్వజమెత్తారు. ఆ పార్టీని నమ్మితే మరోసారి మోసపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినబడాలంటే, మన హక్కులు మనకు దక్కాలంటే బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలన్నారు. ప్రజలు ఆలోచించి ఈ నెల 13న కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. బుధవారం సుల్తానాబాద్, జూలపల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలకు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ఆయన మాట్లాడారు. కేసీఆర్ తెచ్చిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్ల పథకాలను ఎత్తేసేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తున్నదని విమర్శించారు. ఆడబిడ్డల పెండ్లిళ్లకు ఇస్తామన్న తులం బంగారానికి తూట్లు పొడిచిందని, క్వింటాల్ వడ్లకు ₹500 బోనస్ ఇస్తామని చెప్పి బోగస్ చేసిందని, విద్యార్థినుల స్కూటీలకు మంగళంపాడిందని మండిపడ్డారు. వాయిదాలు పెడుతూ రైతురుణమాఫీని ఎగ్గొట్టేందుకు యత్నిస్తున్నదన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుపేదలకు మేలు జరిగిందని, అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కారు దమననీతిని ఎండగట్టేందుకు కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ మాయలో పడి మరోసారి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. విజ్ఞతతో వ్యవహరించి ఓటేసి కార్మికుడి బిడ్డ కొప్పులను గెలిపించాలని కోరారు. పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ మాట్లాడుతూ, ప్రజలు నమ్మడంలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఓట్లకోసం దేవుళ్లపై ఒట్లు పెడుతున్నారని విమర్శించారు. తెలంగాణను సాధించి పదేండ్ల పాటు ప్రజారంజక పాలన అందించిన కేసీఆర్‌ను పరుష పదజాలంతో దూషించడం బాధాకరమన్నారు. సంస్కారహీనంగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రికి ఓటుతో బుద్ధిచెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమాల్లో సుల్తానాబాద్ ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు, విండో చైర్మన్లు, జూపల్లి సందీప్‌రావు, గడ్డం మహిపాల్‌రెడ్డి, పాల రామారావు, బుర్ర శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ పారుపల్లి జ్ఞానేశ్వరి, గుణపతి, జూలపల్లి ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, వైస్ ఎంపీపీ మొగురం రమేశ్, ఎంపీటీసీలు తమ్మడవేని మల్లేశం, కత్తెర్ల శ్రీనివాస్, కంది చొక్కారెడ్డి, లోక రవీందర్‌రెడ్డి, విశారపు వెంకటేశం ఉన్నారు.